# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## సెంట్రల్ రీజినల్ బ్యూరో

**తేది : జూలై 26, 2015**

## కొన ఊపిరి దాకా ఎర్రజెండాను సమున్నతంగా ఎత్తిపట్టిన విప్లవ రచయితల సంఘం నాయకుడు

# కామ్రేడ్ చలసాని ప్రసాద్‌కు అరుణారుణ జోహార్లు!

విరసం వ్యవస్థాపక సభ్యుడు, విప్లవ రచయిత, మేధావి కామ్రేడ్ చలసాని ప్రసాద్ (83) జూలై 25 పొద్దున గుండెపోటుతో విశాఖ పట్టణంలో మరణించారని తెలిసి మా పార్టీ తీవ్రంగా విచారిస్తున్నది. ఆయన కుటుంబ సభ్యులకూ, బంధు మిత్రులకూ, విరసానికీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. ఈ సందర్భంగా విప్లవోద్యమానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుంటోంది.

కామ్రేడ్ చలసాని ప్రసాద్ ఆంధ్ర ప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో ఒక మధ్య తరగతి కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టారు. విశాఖపట్టణంలో అధ్యాపక వృత్తిని చేపట్టిన ఆయన విశాఖపట్టణాన్నే స్వస్థలంగా చేసుకున్నారు. ఆయన సహచరి కామ్రేడ్ విజయలక్ష్మి 2003లో మరణించారు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు. కాగా ఆయన పెద్ద కూతురు కామ్రేడ్ నవత మా పార్టీ సీనియర్ కార్యకర్త.

కటుంబ నేపథ్యం రీత్యా సహజంగానే చిన్న వయసులోనే ఆయన కమ్యూనిస్టు రాజకీయాల వైపు ఆకర్షితులయ్యారు. విప్లవ విద్యార్థి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆయన, ఆ తర్వాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త అయ్యారు. కానీ ఆ తర్వాత కాలంలో ఆ పార్టీలు పార్లమెంటరీ పంథాను అనుసరించి, విప్లవానికి ద్రోహం చేయడంతో వాటిని వ్యతిరేకించారు.

సీపీఐ, సీపీఐ(ఎం)ల రివిజనిజం, నయా రివిజనిజాలను ఎండగడుతూ భారత విప్లవ పంథాను నిర్దేశించిన నక్సల్బరీ మేఘగర్జన పట్ల ఆకర్షితులైన అసంఖ్యాక యువతరంలో ఆయన ఒకరు. నక్సల్బరీ పంథాలో పోటెత్తిన శ్రీకాకుళ పోరాటంతో ఆయన పూర్తిగా మమేకం అయ్యారు. నక్సల్బరీ, శ్రీకాకుళాలు తీవ్ర నిర్బంధానికి గురై దెబ్బ తిన్నప్పటికీ, ఆ విప్లవాగ్నులను ఆరిపోకుండా రాజేసిన విప్లవకారుల్లో ఆయన ఒకరు. అభ్యుదయ రచయితల సంఘం సభ్యుడైన కామ్రేడ్ చలసాని ఆ సంఘం పరిమితులను, మితవాద వైఖరిని ఎండగట్టారు. నక్సల్బరీ, శ్రీకాకుళ రాజకీయాలను వ్యాపింపజేసే సాహితీ సాంస్కృతిక వేదికగా విప్లవ రచయితల సంఘం ఏర్పాటుకు కృషి చేశారు. 1970లో విశాఖలో జరిగిన శ్రీశ్రీ సన్మాన సభలో 'రచయితలారా! కళాకారులారా? మీరెటువైపు?' అంటూ ప్రశ్నించిన చారిత్రక కరపత్రాన్ని వెలువరించడంలో కామ్రేడ్ చలసాని కృషి చిరస్మరణీయమైనది.

విరసం వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయన కొన ఊపిరి వరకూ విరసంలో చురుకైన పాత్ర వహించారు. నిప్పులు చెరిగే నిర్బంధంలో సైతం ఆయన విరసం పతాకను దృఢంగా ఎత్తిపట్టారు. ఎమర్జెన్సీలో అరెస్టయి జైలు గోడల నడుమ కూడా విప్లవాన్ని నినదించారు. 1985లో అప్పటి విరసం కార్యదర్శి కామ్రేడ్ వరవరరావును ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెడితే, కామ్రేడ్ చలసాని కార్యదర్శి బాధ్యతలు చేపట్టి విరసానికి మార్గదర్శకత్వం అందించారు. కొంత కాలం పాటు అధ్యక్షుడిగానూ విరసానికి సేవలందించారు. విరసం అధికారిక పత్రిక అరుణతారకు సంపాదకులుగా పని చేశారు. అఖిల భారత సాహితీ సాంస్కృతిక వేదికలోనూ ఆయన పాత్ర మరువలేనిది. విరసం సభల్లో, సాహిత్య పాఠశాలల్లో, సెమినార్లలో, వర్క్‌షాపుల్లో, రాజకీయ తరగతుల్లో ఇంకా మరెన్నో విప్లవ సంస్థల కార్యక్రమాల్లో ఆయన పాల్గొని విలువైన పాఠాలు చెప్పారు. ప్రసంగాలు చేశారు. శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావుల రచనలను సంపుటాలుగా వెలువరించడానికి ఆయన అలుపెరగని కృషి చేశారు. సంస్థకు ఆయన అందించిన విలువైన సేవలకు గుర్తుగా విరసం ఆయనను శాశ్వత ఆహ్వానితుడిగా గుర్తించి గౌరవించింది.

విప్లవోద్యమ ఆటు పోట్లలో, ఎగుడు దిగుడుల్లో ఆయన నిబ్బరంగా విప్లవోద్యమాన్ని అంటిపెట్టుకొనే వున్నారు. కొండపల్లి, సత్యమూర్తిలు మా పార్టీలో సంక్షోభం తీసుకువచ్చిన సందర్భాల్లో ఆయన విప్లవ పక్షం వైపు దృఢంగా నిలబడ్డారు. నాటి శ్రీకాకుళ పోరాటం దెబ్బతిన్నా, నేటి ఆంధ్రప్రదేశ్ ఉద్యమం దెబ్బతిన్నా భవిష్యత్ పట్ల ఆశావహ దృక్పథాన్ని వీడలేదు.

లోతైన, విస్తృతమైన రాజకీయ, సైద్ధాంతిక అధ్యయనం చేసిన సాహిత్య పిపాసి ఆయన. ఆయన సేకరించుకున్న పుస్తకాలు ఒక అరుదైన గ్రంథాలయంగా, విలువైన సాహితీ సంపదగా నిలిచాయి. విస్తృతమైన అధ్యయనంతో ఆయన పలు రచనలు చేశారు. సూటిదనం, సరళత్వం, క్లుప్తతతో కూడిన ఆయన శైలి పాఠకులను ఆకర్షిస్తుంది. వివిధ సందర్భాల్లో ఆయన చేసిన రచనలను విరసం 2008లో సాహితీ వ్యాసాలు పేరిట సంపుటంగా వెలువరించింది. కేవీఆర్ నుండి చరిత్ర, త్రిపురనేని నుండి తత్వశాస్త్రాన్ని ఔపోసన పట్టి, వాటికి కార్మిక వర్గ రాజకీయాలు జోడించి చేసిన ఆయన రచనలైనా, ప్రసంగాలైనా చాలా పదునుగా వుండేవి. ఆయన కొన్ని కవితలు కూడా రాశారు.

ప్రజాస్వామిక ఉద్యమాల పట్ల స్పష్టమైన అవగాహనను కలిగి వున్న ఆయన ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని గట్టిగా సమర్థించడమే కాదు, విశాఖపట్టణంలో ఆ ఉద్యమానికి మద్దతును కూడగట్టడానికి కృషి చేశారు.

కామ్రేడ్ చలసాని ఎల్లప్పుడూ ఉత్సాహంగా యువ కార్యకర్తలకు ప్రేరణగా వుండేవారు. 80 ఏళ్లు దాటిన వయసులో కూడా ఆయన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో జరిగిన దాదాపు అన్ని విప్లవ కార్యక్రమాలకు హాజరయ్యేవారు. మా ప్రియతమ

అమరుల మృతదేహాల స్వాధీనం కోసం పోరాడేవారు. నిర్బంధాన్ని ధిక్కరించి అమరుల అంత్యక్రియలకు హాజరయ్యేవారు.


ఆయన మంచి గాయకుడు కూడా. ఆయన పలు సందర్భాల్లో 'ఈ విప్లవాగ్నులు ఎచటివని అడిగితే శ్రీకాకుళం వైపు చూడమని చెప్పాలి' అంటూ శ్రీకాకుళ ఉద్యమ స్మృతులను, శ్రీకాకుళ అమరుల త్యాగాలను గుర్తుచేసుకోవడం శ్రీకాకుళ ఉద్యమంతో ఆయన మమేకత్వాన్ని చాటేది.

కామ్రేడ్ చలసాని స్నేహశీలి. తన సంస్థలోనూ, విప్లవోద్యమంలోనూ పని చేసే అతి చిన్న వయసు కార్యకర్తలతో కూడా స్నేహితుడిగా వ్యవహరించేవారు. రాజకీయంగా విభేదించే వాళ్లతోనూ సన్నిహిత స్నేహ సంబంధాలు కొనసాగించే విలక్షణ వ్యక్తిత్వం ఆయనది. తాళాలు లేని ఇండ్లు, బెత్తాలు లేని బళ్లు వుండాలనేది ఆయన కల. దానికి తగినట్టుగా విశాఖపట్టణంలోని వాళ్ల ఇల్లు రాష్ట్రంలోని, దేశంలోని రాజకీయ కార్యకర్తలకు సొంత ఇంటిలాగానూ, రాజకీయ కేంద్రంగానూ వుండేది.

శాస్త్రీయ దృక్పథంతో తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన కామ్రేడ్ చలసాని తన మృత దేహం కూడా శాస్త్ర విజ్ఞానానికి, ప్రజలకు ఉపయోగపడాలనే ఆకాంక్షతో విశాఖ కింగ్‌జార్జ్ హాస్పిటల్‌కు తన శరీరాన్ని దానం చేశారు. ఆయనకు మరోసారి వినమ్రంగా జోహార్లు అర్పిస్తున్నాం.

విప్లవోద్యమం పట్ల కామ్రేడ్ చలసాని అంకిత భావం, సైద్ధాంతిక నిబద్ధత, నిమగ్నత, విప్లవోత్తేజం, ఉత్సాహం, అవిశ్రాంతంగా శ్రమించే గుణాలను నేటి యువతరం ప్రేరణగా తీసుకుంటుందని ఆశిస్తున్నాం.

కామ్రేడ్ చలసాని ఏ విప్లవోద్యమ రాజకీయాలకు తన నిండు జీవితాన్ని అంకితం చేశారో, ఆ విప్లవోద్యమంపై తీవ్ర అణచివేతకు పాల్పడిన, పాల్పడుతున్న; ఆ విప్లవోద్యమ కార్యకర్తలెందరినో క్రూరాతి క్రూరంగా హత్యచేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నేడు కామ్రేడ్ చలసాని మృతికి సంతాపం తెలియజేయడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసి, అమరుడిగా చరిత్రకెక్కిన కామ్రేడ్ చలసాని పేరును ఉచ్ఛరించే అర్హత కూడా చంద్రబాబుకు లేదనీ, చంద్రబాబు బూటకపు మాటలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విప్లవ ప్రజానీకం మోసపోయే స్థితిలో లేరని తెలియజేస్తున్నాం.



**(ప్రతాప్)**

**అధికార ప్రతినిధి,**

**సెంట్రల్ రీజినల్ బ్యూరో (సి.ఆర్.బి),**

**సి.పి.ఐ. (మావోయిస్టు)**